సజావుగా బీఈడీ కౌన్సెలింగ్

ఉట్నూర్, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి) : ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలో 2025-27 విద్యాసంవత్సరానికి గురువారం నిర్వహించిన ప్రవేశ కౌన్సెలింగ్ సజావుగా సాగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేస్రం మనోహర్ తెలిపారు. గణితంలో 25, సాంఘిక శాస్త్రంలో 41, భౌతిక శాస్త్రంలో 10, జీవశాస్త్రలో 23, ఆంగ్లంలో ఒకటి సీట్లను భర్తీ చేశామని వివరించారు. కౌన్సెలింగ్‌లో అధ్యాపకులు రాథోడ్‌మాణిక్‌రావు, రామారావు,రవి, బానోత్ జగన్, శ్రీనివాస్, రాథోడ్‌సుస్మిత, కపిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదిలిస్తే కన్నీళ్లే..

- జిల్లాలో 19వేల ఎకరాలకు పైగా పంట నష్టం
- భారీ వర్షాలు, వరదలతో నేలమట్టమైన పంటలు
- పంటల బీమాకు అవకాశం లేక నష్టపోతున్న రైతులు
- వాటా చెల్లింపుపై చేతులేత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఐదేళ్లుగా పూర్తిగా నిలిచిన ఫసల్‌బీమా

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్థుతం జిల్లాలో ఏ రైతును కదలించినా కన్నీళ్లే కనిపిస్తున్నాయి. ప్రతి యేటా అతివృష్టి, అనావృష్టి కారణంగా అన్నదాతలపై కోలుకోలేని దెబ్బపడుతుంది. ప్రధానంగా పత్తి పంటను సాగు చేయాలంటే రైతులకు పెద్ద సవాల్‌గానే మారుతుంది.

ఆదిలాబాద్, ఆగస్టు21 (ఆంధ్ర జ్యోతి) :ఆపద కాలంలో అన్నదాతలను ఆదుకునేందుకు 2016 ఏప్రిల్ మాసంలో కేంద్ర ప్రభుత్వం ఫసల్‌బీమా యోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రైతులు పంటల బీమాను చేసుకునే అవకాశం ఉండేది. కాని 2020 నుంచి ఫసల్ బీమా యోజన పథకాన్ని పూర్తిగా ఎత్తి వేయడంతో నష్ట పరిహారం కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. 2023-24 యేడాదిలో జిల్లా వ్యాప్తంగా 10వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. దీంతో ప్రభుత్వం స్పందించి ఎకరాన రూ.10వేలను పంట నష్ట పరిహారంగా చెల్లించింది. కాని ఇది ఏ మూలాన సరిపోలేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యేడు కూడా ఆగస్టు 16న రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం జిల్లాలో కురిసింది. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 19వేల ఎకరాలకు పైగా పత్తి, సోయా, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో కోట్ల రూపాయల పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

● బీమా ఉంటే ధీమా ఉండేది...

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రమైన పంట నష్టం జరిగింది. అయితే ఇలాంటి పరిస్థితుల్లో బీమా ఉంటే కొంత ధీమా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదోలగడంతో పంటల బీమాకు అసలు అవకాశమే లేకుండా పోయింది.జిల్లా వ్యాప్తంగా 417 గ్రామాల్లో మొత్తం 7522 మంది రైతులకు సంబంధించిన 19806 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇందులో ప్రధానంగా పత్తి 14532 ఎకరాలు కాగా 2811 ఎకరాల్లో సోయా, 1823 ఎకరాల్లో కంది, మరో 625 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమాతో పాటు ఇతర పంటలకు పంట కోత ప్రయోగం ద్వారా బీమా సోమ్మును చెల్లించే అవకాశం ఉండేది. కాని గత ఐదేళ్లుగా పత్తి పంటకు బీమా ప్రీమియం చెల్లింపులు చేయక పోవడంతో రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని రైతు సంఘాల నేతలు వాపోతున్నారు.



ఆదిలాబాద్‌రూరల్ మండలంలో పత్తి చేనులో ఇసుక మేటలు

● రూ.25వేల పరిహారానికి డిమాండ్....

రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాకు వాటాను చెల్లించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రతిసారి వర్షాలు, వరదలు పంటలను ముంచెత్తడంతో నష్టపోతున్నారు. కనీస మొత్తంలోనే ఎకరాన రూ.10వేలను చెల్లిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందన్న ఆరోపణలు వస్తున్నాయి. పత్తిపంట పూర్తిగా నష్ట పోతే ఎకరాన రూ.85వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లా రైతులకు కోట్ల రూపాయల నష్ట పరిహారం అందేది. బీమా సొమ్మును చెల్లించి ఉంటే ప్రతియేటా జిల్లాలో కనీసం 10వేల ఎకరాలకైనా పంట నష్ట పరిహారం అంది ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్థుతం ఎకరాన రూ.25వేలను చెల్లించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతియేటా అధికార, ప్రతిపక్షాల మధ్య పంటల నష్ట పరిహారం పై మాటల యుద్ధం సాగుతున్న అన్నదాతలకు ఆశించిన ప్రయోజనం దక్కడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తీవ్ర నష్టం జరిగింది

● చుక్కబొట్ల ఇస్తారి (రైతు, బోరజ్ మండలం)



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా బోరజ్ మండలంలో తీవ్రంగా పంటలను నష్ట పోవాల్సి వచ్చింది. బీమా నమోదుకు అవకాశం లేక అప్పుల పాలు కావాల్సి వస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేసి ఉంటే బాగుండేది. ఎకరాన రూ.10వేల పరిహారం ఇస్తే విత్తనాలకు కూడా సరిపోదు. రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కనీసం ఎకరాన రూ.25వేలను ఇస్తే పెట్టిన పెట్టుబడులైనా చేతికి వస్తాయి.

నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాలి...

● సంగెపు బొర్రన్న (రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షులు, ఆదిలాబాద్)



భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే భరోసా కల్పించాలి. ఎకరాన రూ.25వేలను చెల్లించడంతో పాటు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందించాలి. అలాగే కోతకు గురైన పంట చేన్లను చదును చేసుకునేందుకు రుణాలు ఇవ్వాలి. నష్ట తీవ్రతను బట్టి పరిహారం పెంచాలి.

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం : కలెక్టర్
- సమన్వయ కమిటీ సమావేశంలో వినాయక ఉత్సవాల నిర్వహణపై ఉన్నతాధికారుల సూచనలు..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో పాటు అధికారులు వివిధ అంశాలపై సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ హిమ శ్రీ, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు హన్మండ్లు, రాళ్లబండి మహేందర్ తో పాటు వివిధ పార్టీల నేతలు, మత పెద్దలు పాల్గొన్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సామరస్య పూర్వకంగా ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. పోలీస్, విద్యుత్, మున్సిపల్, తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండళ్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పారిశుద్యం, తాగునీరు, మొబైల్ టాయిలెట్, గుంతలు పూడ్చడం వంటి పనులు చేపట్టాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా లూస్ వైర్లను సరిచేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తూ పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజుల్లో పెన్ గంగా, చాందా వద్ద అవసరమైన క్రేన్‌లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని, షిఫ్ట్ ల వారీగా విధులు కేటాయించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ముఖ్య కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు.

గణపతి ఉత్సవాల్లో డీజేలు నిషేధం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం పూర్తి ఏర్పాట్లను చేస్తోందని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా డీజేలకు అనుమతులు లేవని, వాటిని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద ఉపయోగించే సౌండ్ బాక్సులకు, మైక్‌సెట్‌లకు డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర నుంచి డీజేలను తీసుకువచ్చి అద్దెకు ఇచ్చే యజమానుల పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రైతులను అవమానపరిచారు

● మాజీ మంత్రి జోగురామన్న



జైనథ్‌లో పంటలు పరిశీలిస్తున్న మాజీ మంత్రి నేతలు

ఆదిలాబాద్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావు జిల్లా రైతులను అవమానపరిచారని మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. గురువారం బేల, జైనథ్ మండలాల్లో పర్యటించి వరదలతో దెబ్బతిన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జీ మంత్రి రైతులతో కాకుండా అధికారులతో పంటలను పరిశీలించడం ఏమిటని ప్రశ్నించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ కూడా రైతులను పరామర్శించ లేదని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేయడం మానేసి రైతులను ఆదుకోవాలన్నారు. మరోసారి మంత్రి జూపల్లికృష్ణారావు జిల్లాలో పర్యటించి రైతులతో కలిసి పంటలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బేల మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన రైతు లచ్చన్న తనకున్న మూడుఎకరాల పత్తి పం ట వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో కన్నీటి పర్యంతమై ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంటామని ఎకరాన రూ.25వేలను చెల్లించాలని మాజీమంత్రి జోగురామన్న డిమాండ్ చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇందులో రౌతుమనోహర్, సతీష్‌పవార్, ప్రమోద్‌రెడ్డి, లింగారెడ్డి, గోవర్ధన్, సతీష్, తేజారావు, అరుణ్, విలాస్ కోడే, మహేందర్, మధుకర్, బానుచందర్ తదితరులున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



జైనథ్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాయలశంకర్

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనత్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ఆయా గ్రామాల్లో గల ఆడ పిల్లల తల్లిదండ్రులను అర్హులైన వారందరికి కళ్యాణలక్ష్మి, సాదిముబారక్ చెక్కులను అందజేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గురువారం జైనత్ మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆడ పిల్లల పెళ్లిలకు రూ.లక్ష116 వంతో దోహద పడుతుందన్నారు. మధ్య దళారులను లబ్దిదారులు ఆశ్రయించవద్దని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌అడ్డిభోజారెడ్డి, జైనత్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అడ్డిరుకేష్‌రెడ్డిలతో పాటు జైనత్ ఉమ్మడి మండలాల లబ్దిదారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

● విచారణ వేదికలో పాల్గొన్న కలెక్టర్

బజార్హత్నూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో ప్రజావాణి పైలట్ ప్రాజెక్టు కార్యక్రమంలో అందిస్తున్న ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హత ఉండి లబ్ధిపొందని వారు విద్యుత్, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం, రెవెన్యూ సమస్యలతో పాటు అన్ని ప్రజాసమస్యల పరిష్కారార్థం గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అక్కడే పరిష్కారం చూపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లబ్ది పొందని వారు మండల స్థాయిలో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజావాణి ద్వారా సమస్యలకు సత్వరం పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమం ప్రతినెల జరుగుతుందని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని దరఖాస్తు అందగా వెంటనే పనులు ప్రారంభించి పునరుద్ధరించాలని విద్యుత్ సేవలు అందించాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మండలంలో ఆధార్‌సెంటర్ లేక ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. కాగా ప్రజావాణి ప్రత్యేక పోర్టల్ ద్వారా 205 దరఖాస్తులు అందగా గురువారం 77 దరఖాస్తుదారులు హాజరయ్యారు. అందులో 20 దరఖాస్తులు అక్కడే పరిష్కారం అయ్యాయని, మిగతా దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మోహన్ సింగ్, తహసిల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం

చెల్లెలిని కిడ్నాప్ చేసిన అక్క

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తమకు ఇష్టం లేకుండా ప్రేమ వివాహం చేసుకున్న చెల్లిని కుటుంబ సభ్యుల సహకారంతో అక్క కిడ్నాప్ చేసిన కేసును పోలీసులు చేదించారు. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడు అలుగుంటి శ్రీనివాస్ ఈనెల ఏడున తన భార్య భగత్‌మనీషాను ప్రధాన నిందితురాలైన అక్క విజయ, తల్లి సునంద, చెల్లెలు ప్రగతిశీలత, మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. బాధితురాలిని అన్వేషించగా.... కిన్వట్‌లో గుర్తించి తీసుకువచ్చి విచారించారు. తనను బలవంతంగా కుటుంబసభ్యులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని బాధితురాలు విచారణలో వెల్లడించారు. చెల్లెలికి పెళ్లి అయి అక్కకు కాలేదని, అక్క ఇష్టపూర్వకంగా పెళ్లి జరగలేదన్న కక్ష సాధింపు చర్యలో భాగంగా భార్యాభర్తలను విడగొట్టే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే క్రమంలో అక్క అయిన విజయ పోలీస్ స్టేషన్ సిబ్బంది విచారణకు సైతం సహకరించక, సోషల్ మీడియాలో పోలీసులపై దుష్ప్రచారం చేస్తూ, అసత్య ఆరోపణలను చేశారని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులో బాధితురాలికి అక్క అయిన భగత్ విజయ, కిన్వట్‌కు చెందిన ప్రతిన్ ముకింద కనిండే, తల్లి భగత్ సునంద, చెల్లి భగత్ ప్రగతిశీలత, ఓ మైనర్ బాలుడుతో పాటు తాంసి కి చెందిన కూలీ షబ్బీర్ పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పోలీసులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని, అంటువంటి ప్రచారాలను ప్రజలు సైతం నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలి

● ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, ఆగష్టు 21 (ఆంధ్రజ్యోతి) ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఉమ్మడి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆర్యోగ్యకేంద్రంలను సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలు, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశిలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు అన్ని సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీవార్డెన్‌కు షో కాజ్ నోటీసు జారీ చేశారు. విధుల పట్ల సమయపాలన పాటించని ఎస్. జి. టి ఉపాధ్యాయునికి షో కాజ్ నోటీసు జారీ చేశారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి

● జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

నేరడిగొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి పైలట్ ప్రోగ్రాంను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ జీతేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల రైతు వేదికలో నిర్వహించిన సీఎం పైలట్ ప్రజావాణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సీఈఓ జీతేందర్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సీఎం పైలట్ ప్రజావాణి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏ సమస్య ఉన్న ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్యను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారు అందుబాటులో ఉంటారన్నారు. గురువారం 117 దరఖాస్తులు రాగా 61 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన దరఖాస్తులను సైతం త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్, ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ కలీం, ఎంపీఓ లక్ష్మణ్, డిటి విశ్వనాథ్, ఏఈలు నాగేంద్రప్రసాద్. రాథోడ్ దినేష్ సతీష్ గణేష్ కృష్ణవేణి. అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులున్నారు.

తీరని యూరియా కష్టాలు



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. కానీ మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడే యూరియా లభించక వారు ఆగచాట్లు పడుతున్నారు. సొసైటీల వద్ద వరుసలో నిల్చుంటూ ఉంటున్నారు. ఆధార్‌కార్డుకు రెండు, మూడు యూరియా బస్తాలను పంపిణీ చేస్తుండడంతో ఎక్కువ మొత్తంలో భూమి కలిగిన వారు కావాల్సిన బస్తాల కోసం ఇద్దరేసి, ముగ్గురేసి బారులు తీరుతున్నారు. ఇదే అదునుగా కొందరూ వ్యాపారులు తమకు వచ్చిన యూరియాను ఎక్కువ ధరకు అమ్మడం, మరికొందరు ఇతర ఎరువులతో లింకు పెట్టి విక్రయిస్తుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. - ఇచ్చోడ, ఆంధ్రజ్యోతి

కొడుకు పరామర్శకు వచ్చి గుండెపోటుతో తండ్రి మృతి

● బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఘటన, ఆలస్యంగా వెలుగులోకి..

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో కొడుకు కోర్టుకు రిమాండ్ అవుతున్న విషయాన్ని తెలుసుకుని ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తండ్రి గుండెపోటుతో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లా మంకమ్మ తోట గ్రామానికి చెందిన మామిడాల సతీష్ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురు వద్ద రూ. 5.50లక్షలు వసూల్ చేసినట్లు బోథ్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు గత ఏడాది డిసెంబరులో ఫిర్యాదు చేశారు. దీనిపై గత సోమవారం బోథ్ పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఎందుకు తీసుకెళ్లారో తెలుసుకోవడంతో పాటు పరామర్శించడానికి అదే రోజు మధ్యాహ్నం తండ్రి శంకరయ్య(60) సోమవారం బోథ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వివరాలు తెలుసుకుంటుండగానే బీపీ పెరిగి గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులు జిల్లా అధికారులకు నివేదిక సమర్పించారు.

ప్రభుత్వంపై పోరుకు

కదన రంగంలోకి కమలం

● 25న తహసీల్దారులకు వినతిపత్రాలు



రిథేష్‌రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

ఉట్నూర్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతుందని పేర్కొంటు ప్రభుత్వం పై పోరుకు భారతీయ జనతా పార్టీ సిద్ధమవుతుంది. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల25న నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మండల బీజేపీ కమిటీల ఆధ్వర్యంలో ఆయా తహసీల్దారులకు వినతి పత్రాలు ఇవ్వాలని ఆదేశాలు అందాయి. నిర్మల్ జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజక వర్గాలలో ఉన్న 20 మండలాల్లో ఈ నెల 25న తహసీల్దారులకు వినతి పత్రాలు ఇచ్చి బీజేపీ డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని భావిస్తుంది. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వం తుంగలో తొక్కిందని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తుంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 25న నిర్మల్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాల పరిధిలో ఉన్న మండలాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రిథేష్‌రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విషయాలు ప్రజలకు తెలిసే విధంగా ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వం కండ్లు తెరిపించే విధంగా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందిస్తామన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు శాంతి యుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల చెప్పిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిమజ్జనం కార్యక్రమం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డీజె సౌండ్లను పెట్టుకోవద్దని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మడావి ప్రసాద్

ముంపు పొలాల పరిశీలన

తలమడుగు , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. గురువారం తలమడుగు మండలంలోని పల్సి(కే), కచులాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలలో పర్యటించి వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.ఎస్.రామ గోపాల్ వర్మ, ఎం.రఘువీర్, డా. శివచరల్, సురేష్, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

సీపీస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలి

తలమడుగు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు వినోద్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు మండల విద్యాధికారి జి. వెంకట్‌రావు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై. వినోద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలి

ఉట్నూర్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):ఖానాపూర్ నియోజక వర్గంలోని రోడ్ల అభివృద్ధికి, రోడ్ల విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరడం జరిగిందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఖానాపూర్ మండలం ఖానాపూర్ నుంచి బెల్లాల్, ఖానాపూర్ నుంచి తర్లపాడు, ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్, ఉట్నూర్ నుంచి హస్నాపూర్ నార్నూర్‌చౌరస్తా, కలమడుగు నుంచి జన్నారం, జన్నారం నుంచి కవల్ రోడ్లను విస్తరణ చేయాలని కోరడంతో మంత్రి స్పందించి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజుకు ఇవ్వమని హ్యామ్ ప్రాజెక్టులో పెట్టాలని ఆదేశించారన్నారు. రోడ్లు అన్ని హ్యామ్ ప్రాజెక్టులో స్ట్రెంత్‌నింగే (బలోపేతం) చేయాలని మంజూరు ఇచ్చారు. కాని వెడల్పు చేయాలని నిర్ణయం తీసుకోలేదని అందుకని ఆ రోడ్లను బలోపేతం కాదు వెడల్పు చేయాలని కోరడం జరిగిందన్నారునితఈ రోడ్లలో అనునిత్యం అధిక వాహనాలతో పాటు ప్రజలలో రద్దీగా ఉంటుందని తెలిపారు. ఈ రోడ్ల గుండా ప్రజలు కాలినడకన వెళ్లేందుకు ఇబ్బందులు కూడా పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్లను విస్తరించాలని గ్రామస్థులు పలుమార్లు విన్నవిస్తున్నారని అన్నారు. రోడ్లను వెడల్పు చేయడం అనివార్యమని అన్నారు. ఇబ్బందులు కలుగకుండా వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి అంశాల పై చర్చించడం జరిగిందన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల జాతర

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కూలి కుటుంబాలకు 100 రోజుల కనీస కూలి పని కల్పించడానికి ఉద్దేశించిన పనుల జాతర 2025 కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత అంకిత భావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి గాను కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 473 గ్రామాల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆయా నియోజక వర్గాల్లోని ప్రజా ప్రతినిధులు, ఆధికారులు హాజరవుతారని తెలిపారు. సుమారు రూ.62 కోట్ల 27 లక్షల 74 వేల నిధులతో 3034 పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారనీ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

● ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ



ఉట్నూర్‌లో కరపత్రాలు విడుదల చేసిన ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వస్తే ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని భావిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఈ నెల 23న చలో హైదరాబాద్ తలపెట్టింది. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నిర్వహణకమిటీ సభ్యుడు డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్, యూటీఎఫ్‌జిల్లా కార్యదర్శి కుంరశ్రీనివాస్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. టీచర్లకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సి.వీరయ్య, రాథోడ్‌రవిత, అక్కల రవి చందర్‌గౌడ్, దేవిదాస్‌చౌహాన్, చంద్రబాన్ పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం ముగింపు

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచ్చేర గ్రామంలో గురువారం సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు దాత గడ్డం వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

సిరికొండ రూరల్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు అని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది అని రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ మండల అధ్యక్షుడు కుర్మా సదానందం అన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ఆదేశానుసారం గురువారం ఆయన మండలంలోని నారాయణపూర్ , జెండాగూడ, నేరడిగొండ(జి), తదితర గ్రామాల్లో పర్యటించి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన కమిటీల సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పటేల్ లు మడావి తుకారాం, కుమ్ర గణపతి, చిక్రం జంగు, కాంగ్రెస్ పార్టీ మండల సీనీయర్ నాయకులు షేక్ ఇమామ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సిడాం క్రిష్ణ, పెందూర్ యాదవ్ రావ్, ఉయిక దేవ్రావ్, యూత్ ప్రెసిడెంట్ సిడాం ధర్ము, పెందూర్ మహదు, ఆయా గ్రామాల దేవరీలు, మహజన్‌లు పాల్గొన్నారు

డీజేలకు అనుమతి లేదు: ఎస్సై

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న గణపతి నిమజ్జనం కార్యక్రమానికి డిజిలకు అనుమతి లేదని డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని డీజేలను సీజ్ చేస్తామని ఎస్సై శ్రీ సాయి పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీజేలా ఏర్పాటుపై జిల్లా అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశారని అయినా డీజేలను ఏర్పాటు చేసేందుకు కొంతమంది ఉత్సాహం చూపుతున్నారు అన్నారు అయితే ఇప్పటికే ఆరుగురు మంది డీజే నిర్వాహకులను బైండవర్ చేయడం జరిగిందని ఆయన మాట వినకుండా డీజేలను ఏర్పాటు చేసినట్లయితే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.

పలువురి కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీపీ

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్టీకేలో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ మిశ్రం మహ దుబాయ్ ఐటిడిఏ మాజీ డైరెక్టర్ భూమన్న తల్లి మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. అంతేగాక వారం రోజుల క్రితం మృతి చెందిన కోరుట్ల భీముడు కుటుంబాన్ని పోల్ సింగ్ నాయక్ తండ గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ మృతిచెందగా వారి కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి నాయకులు ఆకుల రాజేందర్, మాజీ ఎంపిటిసి రోహిదాస్, బిఆర్ఎస్ నాయకులు సుధీర్ రెడ్డి, అభిలాష్ సోషల్ మీడియా కన్వీనర్ భీమ్రావు, పాటిల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి కోరారు. గురువారం విద్యార్థులకు చేయూతలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టల్ వాడ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బుక్స్‌లు అందజేసి విద్యార్థుల తల్లితండ్రులను సన్మానించారు. అంతకు ముందు పాఠశాలకు వచ్చిన మౌనిష్ రెడ్డి కి విద్యార్థులు ఘనంగా స్వాగతం పాలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిని, ఉపాధ్యాయులు సుష్మరాణి, గీత, మాజీ సర్పంచ్ రాజన్న, యోగేష్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయానికి నిధులు

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి 40 లక్షల రూపాయలు మంజూరు కాగా మొదటి విడతగా 20 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందని ఆత్మ చైర్మన్ జి. రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు తెలిపారు. నిధులు మంజూరైన విషయాన్ని తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని వారు పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా ఇంచార్జి మంత్రి చేతుల మీదుగా ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు.

ప్రిన్సిపాల్ అనురాధకు పీహెచ్‌డీ పట్టా

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న అనురాధ పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టర్ బి.నారాయణ, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకొన్నారు. డాక్టర్ ఫిలాసఫీ విజయవంతంగా పూర్తి చేసినందుకుగాను ఆమెకు పట్టా ప్రదానం చేశారు. పీహెచ్‌డీ పట్టా పొందడంతో ప్రిన్సిపాల్ అనురాధను కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన అనంతరం రికార్డులు పరిశీలించారు. వివిధ రకాల సేవలు గురించి డాక్టర్ నవీన్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న పలు ఆర్‌ఎంపి క్లినిక్‌ను తనిఖీ చేశారు.

25న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట జర్నలిస్టుల ఆందోళన

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు కొండూరి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన టీయూడబ్ల్యూజే యూనియన్ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... టీయూడబ్ల్యూజే జాతీయ సభ్యుడిగా గాండ్ల రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. 29న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వేణుగోపాల్, గుమ్ముల అశోక్, పూసల పోశెట్టి, రాచమల్ల రాజశేఖర్, టి. రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి జల్దా మనోజ్, సట్ల హనుమాన్లు, ప్రచార కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు షిండే మహేష్, కే. రాజేశ్వర్, డీఎస్ మధు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భైంసాలో వికలాంగుల,చేయూత పెన్షన్‌దారుల మహా గర్జన సన్నాహక సదస్సు

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాగర్జన సన్నాహక సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హజరుకానున్నారు. పెండింగ్‌లోనున్న పింఛన్ల చెల్లింపుల పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లతోపాటు పలు ఇతర సమస్యల సాధనకే వచ్చే నెల 9న హైదరాబాద్‌లో ఎంఆర్‌పీఎస్,వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీలు సంయుక్తంగా వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన నిర్వహిస్తున్నారు. జిలాలోని అన్ని రకాల పెన్షన్‌దారులు సన్నాహక సదస్సుకు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సదస్సు విజయవంతానికి భైంసాలోని ప్రధాన కూడలీల్లో ప్రదర్శనలు నిర్వహించారు.

సమానత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచాడని భైంసా గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ గౌడ్, నాగుల కిషన్‌గౌడ్‌లు పేర్కొన్నారు. గురువారం సంఘ భవనంలో జరిగిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో సర్వాయి పాపన్నగౌడ్ స్పూర్తిదాయక మహోన్నత మూర్తిగా త్యాగాలతో కూడిన సేవలందించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మురళిగౌడ్, డా. మధుసూదన్ గౌడ్, రాములు గౌడ్, రాజులతో సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్ గౌరవ సభ్యుడిగా సామల రాజవర్ధన్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రముఖ రచయిత సామల రాజవర్ధన్ తెలుగు సాహితీ విభాగంలో అందించిన సేవకు గాను తెలంగాణ సారస్వత పరిషత్ ఆయనను గౌరవ సభ్యుడిగా నియమించింది. ఈ మేరకు పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఆయనకు జిల్లా కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అభినందనలు తెలిపారు.

పోస్టర్లకు నిప్పంటించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీర్పేల్లిలో ఏర్పాటు చేసిన పోస్టర్లను నిప్పంటించిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. స్థానికంగా నివాసముండే ఆవారి సాగర్ శ్రీ రామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లను అత్వం అనుదీప్ అనే వ్యక్తి కాళ్లతో తన్ని పెట్రోల్‌తో నిప్పటించినట్లు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ కింద ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వెల్లడించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన జనాభాకు విద్య, వైద్యం, మౌలిక ఆర్థిక సదుపాయాలు అందించడంతో పాటు గ్రామ స్థాయిలో పాలనను బలోపేతం చేయడం అభియాన్ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గిరిజనులు వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రతి ప్రభుత్వ పథకం ప్రతి అర్హుడి వరకు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకురావాలన్నారు. 18 లైన్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఇప్పటికే జిల్లాకు చెందిన 7 మంది మాస్టర్ ట్రైనర్లు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి పి. రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి. రాజనర్సయ్య, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పశుసంవర్ధక శాఖ అధికారి రాజేశ్వర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి సందీప్, వైద్య శాఖ అధికారులు సౌమ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసానికి పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకోవాలి

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తానూర్ మండలం బోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగులను గుర్తించి వెంటనే పట్టుకోవాలని పలువురు ప్రతినిధులు భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు సుంకెట పోశెట్టి, తానుర్ మండల మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావ్‌తో కూడిన పలువురు ప్రతినిధుల బృందం మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణంలో ఉన్నటువంటి మురికి కాలువలు, రోడ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో శుభ్రం చేయకపోవడం వలన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణలో ప్రభుత్వం విఫలం అవ్వడం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్. రామలక్ష్మణ్, ఎస్. గంగన్న, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల జాతరను విజయవంతం చేయాలి

దిలావర్‌పూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనుల జాతరను విజయవంతం చేయాలని ఎంపీడీవో అరుణ రాణి అన్నారు. శుక్రవారం నుంచి జాతర ప్రారంభం కానున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించడం పనుల జాతర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఇంద్రకరణ్ పరామర్శ

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటాద్రిపేట్‌కు చెందిన బీసీ అధ్యక్షుడు అనుముల భాస్కర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

● అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం రూరల్ మండలం చిట్యాలలోని అభయ కృషి ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా, డీఏపీ సహా అవసరమైన ఎరువులు సరిపడా స్టాక్‌లో ఉన్నాయని వెల్లడించారు.ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రామాలయంలో సంపూర్ణ రామాయణం

ముథోల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందర్భంగా నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో గల శ్రీ రామ మందిరంలో 25 రోజుల నుంచి సంపూర్ణ రామాయణం కొనసాగుతుంది. చించాల గ్రామంకు చెందిన లింగం పంతులు ఆష్టా గ్రామంలో గల రామాలయంలో ప్రతిరోజు 9 గంటల నుండి 12 గంటల వరకు సంపూర్ణ రామాయణం వివరిస్తున్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

కుంటాల, ఆగస్టు, 21:(ఆంధ్రజ్యోతి): మండలంలోని విట్టాపూర్ గ్రామంలో గురువారం రైతులకు జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ ఆధ్వర్యంలో నానోయూరియా వాడకంపై అవగాహన కల్పించారు. యూరియా ఎక్కువ వాడకం వలన పంటలు ఏపుగా పెరిగి చీడ పీడల బారిన పడడం, నేలలో పోషకాలు దెబ్బతినడం జరుగుతుందని కావున కాంప్లెక్స్ ఎరువులు, యూరియా వాడకం వలన నేలలో కార్బన్ పదార్థం సరైన మోతాదులో లేకపోవడం వలన మొక్కకు అందడం లేదని వేసిన ఎరువులు వృధాగా భూమిలో నిల్వ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి విక్రమ్, ఏఈవో గణేష్, స్థానికులు రమేష్, సుదర్శన్ రెడ్డి, లింగా రెడ్డి, రవి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రభాకర్ మహారాజ్ పుణ్యతిథి

కుంటాల, ఆగస్టు, 21:(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు దత్త వెంకటసాయి మందిరంలో గురువారం ప్రభాకర్‌మహారాజ్ పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మహారాజ్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. ప్రభాకర్ మహారాజ్ ఆలయాభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భజన, సంకీర్తన తదితర కార్యక్రమాలు చేపట్టారు.

శునకాల సమావేశం.. కరవాలని తీర్మానం..!



గుంపులుగా ఊర కుక్కలు

ముథోల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఊర కుక్కలు ఒకటా రెండా వందలాదిగా రోడ్లపై తిరుగాడుతూ ఇటు బాటసారులను అటు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. అంతేకాకుండా మేక పిల్లలను సైతం క్కులు దాడి చేస్తున్నాయి. మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కల బెడద తప్పడం లేదని వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసిన ఊర కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడులు చేడయము, మోటార్ సైకిల్‌పై వెళ్లే వాహనదారుల వెంట పరిగెత్తి కరవడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వెళ్లే వ్యక్తులు భయపడి అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాల బారిన పడుతున్నారు. గొర్రెలు, మేకలు, పశువులపై దాడి చేయడంతో కొన్ని మృత్యువాత కూడా పడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి తీవ్ర గాయాలు చేయడం చేస్తున్నాయి. కుక్కలు కరవడం వల్ల కొందరికి తీవ్ర గాయాలతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు. రాత్రి సమయాల్లో విపరీతంగా అరవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. రోడ్లపైకి ఒకేసారి పదుల సంఖ్యలో ఊర కుక్కలు రావడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు, బాటసారులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు కుక్కల నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ఏ గ్రామంలో చూసినా కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాల్లో ఊర కుక్కల బెడద లేకుండా వాటి సంఖ్య తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అరె మరాఠాలను ఓబీసీలో చేర్చాలి

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న అరె మరాఠాలను కేంద్ర ప్రభుత్వం కాలయాపనకు తావు లేకుండా ఓబీసీలో చేర్చాలని అరె మరాఠా ఓబీసీ సాధన సమితి భైంసా డివిజన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం భైంసాలో జరిగిన సమావేశంలో అరె మరాఠా ఓబీసీ సాధన సమితి ప్రతినిధులు సింధే ఆనంద్ రావ్ పాటిల్, కంతాలె రఘువీర్ పాటిల్ లు మాట్లాడారు. అరె మరాఠాలు అన్నింటా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అరె మరాఠా సంఘం భైంసా డివిజన్ గౌరవాధ్యక్షులు జాధవ్ పుండలిక్‌రావ్ పాటిల్, ప్రతినిధులు జాధవ్ మారుతి పాటిల్, సూర్యవంశీ చంద్రకాంత్, జోగ్‌దాండే శివ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి అల్లోల పరామర్శ

సారంగాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సుధాకర్ గౌడ్ గత వారం రోజుల క్రితం మృతి చెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు నారాయణ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాధవ్‌రావు, పాకాల రాంచందర్, రాజేందర్ ఉట్ల రాజేశ్వర్, తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల అమావాస్య సందడి



సామగ్రిని ఖరీదు చేస్తున్న రైతన్నలు



కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు

ఆదిలాబాద్‌టౌన్/భైంసా, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అన్న దాతలు అత్యంత ప్రీతిపాత్రంగా జరుపుకునే పొలాల అమావాస్య సందడి జిల్లాలోని పల్లెల్లో కనిపిస్తోంది. శుక్రవారం పొలాల అమావాస్య పండగ ఉండడంతో అన్నదాతలు పండగకు సంబంధించి పనులు పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. పండగకు అవసర మైన వస్తువులను ఖరీదు చేసేందుకు ఆసక్తి చూపడంతో పట్టణంలోని ప్రధాన వీధులు కిటకిట లడాయి. శ్రావణ అమావాస్య సందర్భంగా జరుపుకునే పొలాలకు పల్లెల్లో విశేష స్థానమున్న నేపథ్యంలో పండగకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఎద్దులను అందంగా అలంకరించడానికి అవసరమైన వస్తు సామగ్రితో పాటు.. ప్రత్యేక పూజలు చేపట్టడానికి అవసరమైన సా మగ్రిని ఖరీదు చేశారు. చుట్టుపక్కల పల్లె ప్రజలు పట్టణానికి ఖరీదు కోసం రావడంతో స్థానిక అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, దేవిచంద్ చౌక్ ల వద్ద సందడి నెలకొంది. ఇండ్లల్లో జరుపుకునే ప్రత్యేక పూజల కోసం అవసరమైన ఎడ్ల ప్రతిమలు, తదితర సామగ్రిని ఖరీదు చేశారు. పల్లెల్లో పండగను వైభవంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పొలాల నాడు శుభ్రంగా స్నానం చేయించాక.. అందుంగ అలంకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ దేవతలు, హనుమాన్ ఆలయాల చుట్టూ తిప్పి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తిరిగి ఎవరింటికి వారి ఎద్దులను తెచ్చి పుట్టింటి బిడ్డల చేతుల మీదుగ నైవేద్య వితరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సభ్యులంతా కలిసి ఎద్దుల కాళ్లు మొక్కి కృతజ్ఞతా భావం చాటుకుంటారు. ఇలా చేయడం ద్వారా శివపార్వతులు ప్రత్యక్షంగా వీక్షిస్తూ... దీవిస్తారనేది రైతుల విశ్వాసం. భాజ భజంత్రీలు, డప్పు చప్పుల్ల నడుమ ప్రతి ఊర్‌లో పొలాల పండగను సంబరంగా జరుపుకోనున్నారు. ఎడ్లకు అలంకార సామగ్రి విక్రయాలు, రంగు రంగుల తాళ్లు, పగ్గాలు, గ?లు, గంటలు, ఎడ్లకు కొమ్ములకు పూయడానికి రంగులు విక్రయించే దుకాణాలలో సందడి కనిపిం చింది.భైంసా డివిజన్ పరిధిలోని ప్రాంత రైతాంగం శుక్రవారం జరిగే పోలాల అమావాస్య కోసం సిద్దమ య్యారు. బసవన్నలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించే ఈ పండుగ కొరకు రైతులు మూడు రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సంద ర్భాన్ని పురస్కరించుకొని తమ బసవన్నలను సర్వంగా సుందరంగా ముస్తాబు చేసేందుకు గాను ముక్కుతా డులు, గజ్జెలు, పగ్గాలు, కాగితపు, ప్లాస్టిక్ పువ్వులు, మెడలకు వేసే జోళ్ళు, వస్త్రాలతో తయారు చేసిన కవచాలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని గాంధీ గంజ్ ప్రాంతంలో అలంకరణ సామాగ్రి విక్రయాలు కేంద్రాలు అధికంగా వెలిసాయి. ప్రతియేటా ఇక్కడ ప్రాంతంతో పోలాల అమావాస్యను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. స్థానిక కిసాన్‌గల్లిలోని ఆలయం చుట్టూ బసవన్నలను ముస్తాబు చేసి ప్రదక్షిణలు నిర్వహింపచేస్తారు.అనంతరం వాటికి తమతమ ఇంటి వద్ద నైవేద్యాలు సమర్పించి పూజలు చేపడతా రు. నేటి ఆధునిక యుగంలో పర్వదిన వేడుకల నిర్వాహణ ప్రక్రియలో వినూత్న మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో ఆధునిక పోకడలు సంతరించుకుంటున్నాయి. అన్నదాతలు నియమనిష్ఠలతో పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పోలాల అమావాస్య ఇందుకు మినహాయింపు కాలేకపోతోంది. అయితే వీటి స్థానంలో పీవోపీతో తయారు చేసిన రెడిమెడ్ ఎద్దుల ప్రతిమలు వచ్చేసాయి.స్థానిక మార్కెట్‌లో గురువారం ఇలాంటి ఎద్దుల ప్రతిమలు జోరుగా విక్రయి ంచబడ్డాయి. రైతులు వీటిని అధికంగా కొనుగోలు చేశారు. ఎద్దుల ప్రతిమల పరిమాణా లను బట్టి ఒక్కో జత రూ.50 నుంచి రూ.600 వరకు లభ్యమవుతున్నాయి.

బడులకు రెండు రోజుల సెలవులు

ఉట్నూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలకు పొలాల పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా గురువారం ప్రకటించారు. శుక్రవారం, శనివారం రెండు రోజులు సెలవులు ఉంటాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు గమనించాలని అన్నారు.

భజన పోటీల్లో తాంసి మండల కళాకారులు

తాంసి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):గత 26 రోజుల నుంచి తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో అఖండ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా భజన పోటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే తాంసి మండలానికి చెందిన భజన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. గురువారం మండలంలోని పొన్నారి, వడ్డాడి, హసనాపూర్ గ్రామాలకు చెందిన భజన కళాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చెవులకు ఇంపుగొల్పే పాటలు పాడడంతో వచ్చిన భక్తులను ఎంతో ఆకట్టుకున్నారు.పొన్నారి గ్రామానికి చెందిన గడు గు గంగన్న వాయించిన తబలా అందరిని ఆకట్టుకుంది. హసనాపూర్ గ్రా మానికి చెందిన లింగారెడ్డి పాడిన పాటలు చాలా బాగున్నాయి అంటూ కొనియాడారు.చిన్నన్న వాయించిన తాళం అందరినీ ఆకర్షించింది. 25న ముగింపు రోజున బహుమతులు ప్రధానంచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆదివాసీల నోవోంగ్ పూజలు

బజార్హత్నూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలస్వాంగి గ్రామ శివారులో మంగళవారం సిడాం పరివారం ఆధ్వర్యంలో నోవేంగ్ (కొత్త పంటల) ప్రత్యేకపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసంలో గోండు గూడాలలో కొత్త పంటలతో ఈ నోవోంగ్ ప్రత్యేక పూజలు చేయడం ఆదివాసి గోండు తెగల వారి అనాదిగా ఆచరిస్తున్న సాంప్రదాయంగా సిడాం శంభు హన్మంతులు వివరించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది వేసిన పంటలు, ధాన్యాలు కూరగాయలను తమ పెర్సాపేన్, సతీక్ దేవుళ్లకు సమరించి సామ బియ్యం, నెయ్యితో వండిన ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో భూమన్న, లక్ష్మణ్, జంగు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాబావు సాఠే జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అన్నబావు సాటే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాహిత్య సామ్రాట్ అన్నబావు సాటే జయంతి వేడుకలను ఈనెల 24న పట్టణంలోని ఎస్టీయూ భవన్ లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు గణేష్ మెకానే తెలిపారు.సమావేశంలో ఆయన పాల్గొని కార్యక్రమ వివరాలను వెల్లడించారు. తన సాహిత్య రచనలతో సమాజంలో స్ఫూర్తి నింపిన అన్నబావు సాటే జయంతి కార్యక్రమానికి ప్రజలుహాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు దీపక్ మోరే, శిన్కర్ కాంబ్లే, దిగంబర్ కాంబ్లే పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

డాక్టర్ రామారావు, జిల్లా పశువైద్య అధికారి

ప్రశ్న:వరదలుముంచెత్తిన గ్రామాల్లో పశువులకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ప్ర: వర్షాకాల సీజన్‌లో పశువులకు ఎలాంటి వ్యాధులు సోకుతాయి....?

జ: ముఖ్యంగా వర్షాకాల సీజన్‌లో ఆగిఉన్న నీటి కుంటల్లో పశువులు నీళ్లు తాగడంతో గొంతువాపు, దూడల్లో జబ్బవాపు వస్తుంది. వీటికి సంబంధించిన వ్యాక్సినేషన్‌ను అందుబాటులో ఉంచాం.

ప్ర: వర్షాలు, వరదలతో పశుగ్రాసం కొరతను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు...?

జ:జిల్లాలో పెన్‌గంగా పరివాహక ప్రాంతం మండలాలతో పాటు కడెం నది పరివాహక మండలాల్లో భారీవరదలు రావడంతో నేల కోతకు గురైంది. దీంతో పశుగ్రాసం కొరత రాకుండా 75శాతం సబ్సిడీ పైగడ్డి విత్తనాలను అందిస్తున్నాం.జిల్లాకు 2 మెట్రిక్ టన్నుల గడ్డివిత్తనాలను ప్రభుత్వంసరఫరా చేసింది.

ప్ర:గొర్రెలు,మేకల్లోఎలాంటి వ్యాధులువస్తున్నాయి.?

జ: గొర్రెల్లో నీలినాలుక వ్యాధి వస్తుంది. దీంతో 25శాతం గొర్రెలు చనిపోయే అవకాశం ఉంటుంది. దీని నివారణ కోసం ప్రత్యేకమైన వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. రైతులు అప్రమత్తమై గొర్రెలకు వ్యాక్సినేషన్ ఇప్పించాలి. అలాగే మేకల్లో మసూచి వ్యాధి కనిపిస్తుంది. దీని నివారణకు వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంది.

ప్ర:పశువైద్యశాలలో సరిపడ వైద్యసిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయా...?

జ: జిల్లా వ్యాప్తంగా ఉన్నా అన్ని పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. వర్షాకాలంలో సోకే వ్యాధులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాం. ఎప్పటికప్పుడు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

-ఆంధ్రజ్యోతి,ఆదిలాబాద్

ఘనంగా నల్దుర్తి భీమన్న గంగాస్నానోత్సవం

● నేడు నల్దుర్తి భీమన్న స్వామి జాతర



నల్దుర్తి భీమన్న గంగాస్నానోత్సవంలో పాల్గొన్న భక్తులు

మామడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్దుర్తి గ్రామంలో గల పురాతన ప్రసిద్ధిగాంచిన భీమేశ్వర స్వామివారి గంగాస్నానోత్సవం గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి శోభా యాత్రలో ఉత్సవ విగ్రహాలను ఇంటింటికి తీసుకెళ్లి భక్తులు కోరికలు తీర్చుకునే విదంగా ఏర్పాటు చేశారు. అనంతరం గోదావరి నది తీరానికి చక్రస్నానం చేయించడానికి పూజారులు,గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లారు.

నేడు నల్దుర్తి భీమేశ్వర స్వామి జాతర...

శుక్రవారం రోజున భీమేశ్వర స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు అటవీ ప్రాంతంలో గల దట్టమైన అడవిలో అర్ధరాత్రి బండారు బసంతం ఆడి గంగాస్నానం నుంచి తెచ్చిన విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్, ఈజీఎస్ ఏపీడీలు

దిలావర్‌పూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చే చేయూతను అందిపుచ్చుకుని మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వాలంబన సాధించాలని సెర్ప్ ఏపీడీ చరణ్ దాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ నాగవర్ధన్‌లు అన్నారు. గురువారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో జరిగిన చైతన్య మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. మహిళలకు కావలసిన జీవనోపాధులైన పండ్ల తోటల పెంపకం, కోళ్ళు, గొర్రెలు, మేకలు, గేదెల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వాటికి షెడ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఐదు గుంటల భూమిలో ఫిష్ పండ్ ఏర్పాటు చేసుకున్న వారికి కూడా ఫిష్ పండ్‌కు అవసరమైన సదుపాయాలు ఉచితంగా ఇస్తామన్నరు. కిశోర బాలికల సంఘాలు, దివ్యాంగుల సంఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కొత్తగా మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పించాలని కోరారు. 7, 8వ తరగతులు చదివి బడి మానేసిన మహిళలు పదవ తరగతి పరీక్షలు రాసేందుకు అవకాశం ఉందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఎం (ఫైనాన్స్) గంగన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, ఏపీఎం భోసు, ఏపీవో దివ్య రెడ్డి, సీసీలు, టీఏలు, గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, మండల సమాఖ్య సిబ్బంది, ఉపాధి హామీ ఎఫ్ఏలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు

నాటిన మొక్కలను పరిరక్షించాలి

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను ప్రజలందరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, బి. రమేష్‌లు పేర్కొన్నారు. గురువారం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మేకల కాపరులు మొక్కలను పరిరక్షించాలని కోరారు. వాతావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర ఎంతగానో ఉంటుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్దం శ్రీను, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర యువ అధ్యక్షుడిగా ఆత్రం అఖిల్



జైనథ్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ప్రధాన జన జాతి ఉత్తన్ సంఘటన్ న్యూఢిల్లీ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన జైనత్‌లో పర్ధాన్ జాతి సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేపీ ధర్మగురువు యువ అధ్యక్షులుగా ఆత్రం అఖిల్‌ను నియమించారు. ఈ సందర్భంగా అఖిల్‌ను పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్ ఉత్తన్ సంఘటన్ జిల్లా సెక్రటరీ జనరల్ గేడంలక్ష్మణ్, సిడాం రాంకిషన్, గేడంకవిత మనోహర్, గేడం పాండురంగ, రాష్ట్ర అధ్యక్షులు దుర్వనగేష్, రాష్ట్ర కార్యదర్శి కుర్సంగే యాదవ్‌రావ్, ఆత్రంభూమన్న, దర్వఅబియాన్, ముఖ్య అతిథి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుహాసినిరెడ్డి, కుల సభ్యులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలు సిద్ధం

బోథ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రబి యాసంగి పంట వేసేందుకు గాను ఇబ్బందులు కలగకుండా ముందుగానే తెలంగాణ సీడ్స్ వారి ఆధ్వర్యంలో సెనగ పంట విత్తనాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. విత్తనాలు స్థానిక విత్తన డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతాంగానికి అందించాలన్న ఉద్దేశంతో సీడ్ తెప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సీడ్ ఆఫీసర్ మహేష్, స్థానిక వ్యాపారులు సంతోష్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెగులు సోకిన పత్తి పంట

తాంసి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం వర్షాభావం ఎక్కువ అయినందున పత్తికి విల్టు తెగుళ్ళ సోకుతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల 40 వేల ఎకరాలలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. తాంసి మండలంలో సుమారు మూడు వేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దినమంతా పచ్చగా ఉంటున్న పంట తెల్లారి పంట పొలానికి వెళితే మాడిపోయి కనిపిస్తుందని అంటున్నారు. నివారణ చర్యలు తెలపాలని మండల రైతులు కోరుతున్నారు.



తెగులు సోకిన పత్తి పంట

సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రం వార్షికోత్సవం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సత్యసాయి సర్వ ధర్మ సమన్వయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కేంద్రం ప్రారంభించి పదమూడు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ మేరకు గురువారం కేంద్రంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక హారతులు అందించిన అనంతరం రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. గత పదమూడేల్లుగా దాదాపు ఇరవై లక్షలకు పైగా మందికి ఆకలి తీర్చిననిత్యాన్నదాన కేంద్రంలో రోగులతో పాటు వారి సహాయకులకు సైతం భోజన వసతి కల్పిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు రుచికరమైన భోజనాలను క్రమం తప్పకుండా అందిస్తున్నారు. దాతలు సైతంఅన్నదాన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ మానవత్వాన్ని చాటుతున్నారు.

బెంచీలు, కుర్చీల పంపిణీ

నార్నూర్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డీహెచ్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గంగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బెంచీలు, కుర్చీలను ట్రస్ట్ వ్యవస్థాపకుడు డిగంబర్ శిరీష్ రాథోడ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పవర్ అనిత, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ రెడ్డి నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, బంజారా సంఘం నాయకుడు రామేశ్వర రాథోడ్, డీహెచ్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కో ఫౌండర్ డాక్టర్ దిపిక రాథోడ్, అడ్వైజర్ రజిత రాథోడ్, పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు

తలమడుగు , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడ్డ అదిలాబాద్ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి రాష్ట్ర ఐటి శాఖ మంత్రిని హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, ఇండస్ట్రీ మంత్రి శ్రీధరబాబును మర్యాద పూర్వకంగా కలిసి మంత్రికి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

తోయగూడలో వైద్య శిబిరం



తోయగూడలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తోయగూడ గ్రామంలో గురువారం హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఈసందర్భంగా హెల్త్‌సూపర్ వైజర్ పవార్ సురేష్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరునిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి వల్ల డెంగ్యూ, చికున్‌గున్యాయా, మలేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చేఅవకాశం ఉంటుందని హెచ్చరించారు .ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సుదివ్య, ఏఎన్ఎం పద్మ, సముద్ర మరియు హెల్త్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

మంగ మఠంలో సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అతి పురాతనమైన మంగ మఠంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజాది క్రతువులను జరుపుతున్నారు. అత్యంత పవిత్రమైన శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు, హారతులతో స్వామి వారిని కొలుస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం ఆలయ ప్రాంగణంలో ఎల్.ఐ.సి డీవో మహేందర్ బాబు దుంపతుల ఆధ్వర్యంలో సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి శ్రద్ధల నడుమ ఆచారించారు. ఉదయం నుంచే ఆలయంలో సందడి నెలకొనగా.... పెద్ద సంఖ్యలో ఎల్.ఐ.సి ఏజెంట్లు, భక్తులు పాల్గొన్నారు. వేద పండితుల సూచనల మేరకు స్వామి వారి వ్రతాన్ని ఆచరించి... పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సత్యనారాయణ స్వామి వ్రతం విశిష్టతను వేద పండితులు భక్తులకు వివరిస్తూ పూజలు చేయించారు. అనంతరం ప్రత్యేక హారతులు అందచేసి స్వామిని కొలిచారు. వ్రతాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో జరిగే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందని ఎల్.ఐ.సి డీ.వో మహేందర్ బాబు తెలిపారు. స్వామి వారి కృపతో సమస్త ప్రజానీకం సుభిక్షంగా జీవించాలని పలువురు భక్తులు ఆకాంక్షించారు.

నిరసనతో నీళ్లొచ్చాయి



నీళ్లను పరిశీలిస్తున్న ఆదివాసి మహిళలు

ఖానాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తమ కాలనీలో నీళ్లు రావడం లేదని పాత తర్లపాడ్ గ్రామానికి చెందిన ఆదివాసీలంతా ఉదయం ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రత్నాకర్ రావు యుద్ధ ప్రాతిపదికన చెడిపోయిన బోరుకు మరమ్మ తులు చేయించి మధ్యాహ్నానికి వారికి నీళ్లొచ్చేలా చేశారు. కాగా 15 రోజులుగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ఆదివాసీలు ఖాళీ బిందెలతో ఆందోళన చేయడంతో వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఎంపీడీవోను సంప్రదిం చగా ఆయన వెంటనే స్పందించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో పాత తర్లపాడ్ గ్రామానికి చెందిన ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించిన అధికారులతో పాటు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

తీరొక్క ఉపాయం..



ద్విచక్రవాహన నంబరు ప్లేట్లపై వేసిన సంచులు

ఇచ్చోడ, ఆగస్టు, 21 (ఆంధ్రజ్యోతి) : తన వ్యాపార దుకాణం ముందే నిలిపి ఉన్న వాహనానికి పదేపదే వస్తున్న పార్కింగ్ చలాన్లను తప్పించుకోవడానికి వినూత్న ఆలోచన చేశాడు ఓ దుకాణదారుడు. నో పార్కింగ్ స్థలం కానప్పటికీ తన వాహనం తన దుకాణం ముందే కళ్ల ముందే నిలిపి ఉంచినప్పటికీ పోలీసులు ఏడు సార్లు చలాన్లు పంపడంతో విసుగుచెందిన దుకాణదారడు తన వాహనానికి ముందు వెనుక నంబర్ ప్లేట్ కనబడకుండా సంచులను కట్టిన చిత్రమిది. చూసేవారికి ఆశ్చర్యాన్ని కొలుపుతున్నప్పటికీ అనవసర చలాన్లను తప్పించుకోవడానికే ఇలా ఉపాయం చేశానని వాహనం నడుపుతున్నపుడు ఈ సంచులను తొలగిస్తున్నానని దుకాణాదారుడు తెలిపాడు.



ఐటీడీఏ నుంచి విత్తనాల పంపిణీ

కడెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్లాంపూర్, కొలాంగూడ వాసులకు ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొలాంగూడ వాసులు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లో ఉన్న తమకు ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేసిన ఐటీడీఏ పీవో కుష్బూగుప్తాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రవి కుమార్, గ్రామ మాజీసర్పంచ్ పద్మ, జైతు, తదితరులు పాల్గొన్నారు.

మందుల దుకాణాల మాయాజాలం!

- రూల్స్‌కు విరుద్ధంగా హెచ్ 1 డ్రగ్స్ అమ్మకాలు
- నిబంధనలు బేఖాతరు
- ఇష్టారాజ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ
- అడిగితేనే బిల్లులు... నిఘా కరువు
- యజమానుల ఇష్టారాజ్యం

నిర్మల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రైవేట్ మెడికల్ షాపులు నిబంధనను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా అమ్మకాలను సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వారం రోజుల నుంచి నిర్మల్ జిల్లాలో ఔషధ నియంత్రణ అధికారులు జరుపుతున్న తనిఖీలలో పెద్దఎత్తున అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జి అధికారి పర్యవేక్షణలో జిల్లా మెడికల్ షాపుల తనిఖీల వ్యవహారం కొనసాగుతున్న కారణంగా పర్యవేక్షణ లోపించి అక్రమాలకు అడ్డు లేకుండా పోతుందని అంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులలో నిబంధనలకు విరుద్ధంగా పెద్దఎత్తున మత్తు మందుల అమ్మకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో నిర్మల్ జిల్లాలోని ఆరు మెడికల్ షాపులపై దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 మత్తు మందులను అమ్ముతున్నట్లు నిర్ధారించారు. షెడ్యూల్ హెచ్ 1బి ప్రకారం మొత్తం నలభై ఆరు రకాల మందులను అమ్మేటప్పుడు అనేక నిబంధనలను పాటించాల్సి ఉంది. ముఖ్యంగా క్వాలిఫైడ్ డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలి. అలాగే హెచ్ 1 రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. దీంతో బిల్లును సైతం తప్పనిసరిగా కొనుగోలుదారుడికి ఇవ్వాలి. అయితే జిల్లాలోని అనేక మెడికల్ షాపుల్లో ఈ నిబంధనలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయన్న పిర్యాదులున్నాయి. సంబంధిత ఆఫీసర్లు మత్తు మందుల అమ్మకాలపై సీరియస్‌గా చర్యలు తీసుకోకపోతుండడం మెడికల్ వ్యాపారులకు వరంగా మారుతోంది. అయితే జిల్లాలో ప్రైవేట్ మెడికల్ షాపులు రూల్స్‌ను పక్కనపెట్టి ఇష్టానుసారంగా మత్తు మందులను, మరికొన్ని దుకాణాలలో నిషేధిత మందులను సైతం అమ్ముతున్నారన్న ఆరోపణలున్నాయి. మత్తు ఫార్ములాతో కూడిన ట్యాబ్లెట్స్, సిరప్‌లను అడ్డగోలుగా అమ్ముతూ మెడికల్ షాపుల యాజమాన్యాలు లక్షల రూపాయలను ఆర్జిస్తున్నాయన్న విమర్శలున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లోని కొన్ని మెడికల్ షాపులు ఇలా నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 ట్యాబ్లెట్లు, సిరప్‌లను అమ్ముతున్నాయన్న పిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోతుండటం మెడికల్ షాప్ యాజమాన్యాలకు వరంగా మారుతోంది. సరైన తనిఖీలు లేని కారణంగా చాలా మెడికల్ షాపుల్లో ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులను విక్రయిస్తున్నారని అలాగే ఏ ఒక్క షాపులో కూడా ఫార్మసిస్టు ఉన్న దాఖలాలు లేవంటున్నారు. ప్రతి మెడికల్ షాపులో తప్పనిసరిగా ఓ ఫార్మసిస్టు ఉండాలని అలాగే మందులు కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, బిల్లుపై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ డేట్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఉంది. చాలా మెడికల్ షాపులలో కొనుగోలు చేసిన మందులకు సంబంధించిన బిల్లులు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. గతంలో హెచ్ 1 మందులను అమ్మిన ఆరు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ మందుల దుకాణాల యాజమాన్యాలలో మార్పు మాత్రం కనిపించడం లేదంటున్నారు.



మెడికల్ ఏజెన్సీలను తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ అధికారి (ఫైల్)

ఇష్టారాజ్యంగా మందులు అమ్మకాలు...

జిల్లాలోని అనేక మెడికల్ షాపులు ఇష్టారాజ్యంగా మందులను అమ్ముతున్నట్లు ఫిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేయకపోతుండటం యాజమాన్యాలకు కలిసొస్తుందంటున్నారు. సరైన నిఘా, తనిఖీలు లేకపోవడంతో మెడికల్ షాపులు ఇష్టారాజ్యంగా జనరిక్ మందులను సైతం అంటగడుతున్నాయన్న విమర్శలున్నాయి. మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వకపోవడం, మందుల షాపులలో ఫార్మసిస్టును నియమించకపోవడం, అన్ క్వాలిఫైడ్ సిబ్బందితో మందుల విక్రయాలు కొనసాగించడం, మత్తును కలిగించే ట్యాబ్లెట్స్, సిరప్‌లను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారన్న విమర్శలున్నాయి.

ఆర్ఎంపీలతో మిలాఖత్?

పల్లె ప్రాంతాలలోని మెడికల్ షాపులు అక్కడి ఆర్ఎంపీలతో మిలాఖత్ అవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో ప్రిస్క్రిప్షన్‌పై మొత్తం కొనుగోళ్లను బట్టి ఆర్ఎంపీలకు కమీషన్‌లు చెల్లిస్తుంటారని పేర్కొంటున్నారు. ఎమ్మార్పీ ఎక్కువగా ముద్రించి ఉన్న మందులను రోగులకు అంటగడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఆర్ఎంపీలు ఎక్కువ పర్సెంటేజ్ వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారంటున్నారు. పల్లెల్లో మెడికల్ వ్యాపారంపై ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో ఆర్ఎంపీలు, అక్కడి మెడికల్ వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందన్న విమర్శలున్నాయి.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఆర్‌బీఐ అధికారి సత్యజిత్ గోష్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌బీఐ అధికారి

దిలావర్‌పూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ అధికారి సత్యజిత్ గోష్ అన్నారు. గురువారం డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ఆఫ్ఇండియా అధికారి సత్యజిత్ గోష్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేపథ్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యజిత్ గోష్ బృందం విద్యార్థులకు బ్యాంక్ ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన ఆర్‌టీజీఎస్, యూపీఐ, ఆధార్ ఆధారిత లావాదేవీలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మొదలై వాటికి సంబంధించిన కనిష్ఠ, గరిష్ఠ లావాదేవీలపై వాటిని ఎలా ఉపయోగించాలన్న విషయాలను విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ మధ్య తరచుగా జరుగుతున్న ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా మీ సమాచారాన్ని ఇవ్వకూడదన్నారు. అవసరమైతే మీ బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లి మాత్రమే మీ కేవైసీని పూర్తి చేసుకోవాలన్నారు. లింకుల పైన క్లిక్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, నిర్మల్ లీడ్ మేనేజర్ రామ్ గోపాల్, ఇతర బ్యాంక్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రై డేను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్



కాలువలను పరిశీలిస్తున్న అధికారి

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ అన్నారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లిలో నిర్వహిస్తున్న రాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఆరోగ్య పర్యవేక్షకులు స్వామి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే



రాష్ట్ర మంత్రిని కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే

కడెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఖానాపూర్ నుంచి బెల్లాల్ రోడ్డు విస్తరణకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని కలిసి మాట్లాడారు. బెల్లాల్, లింగాపూర్, మద్దిపగడ, బెల్లాల్ నుంచి ఖానాపూర్ వరకు 24.60 కిలోమీటర్లు, ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వరకు 2.80 కిలోమీటర్ల రోడ్డు చాలా రద్దీగా ఉంటుందని వివరించారు. ఈ రోడ్లలో అనునిత్యం అధిక వాహనాలతో పాటు ప్రజలతో రద్దీగా ఉంటుందని తెలిపారు. ఈ రోడ్ల గుండా ప్రజలు కాలినడకన వెళ్లేందుకే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్లను విస్తరించాలని గ్రామస్థులు పలుమార్లు విన్నవిస్తున్నారన్నారు. రోడ్లను వెడల్పు చేయడం అనివార్యమని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి అంశాలపై చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు.

శోభాయాత్ర రూట్ పరిశీలన



శోభాయాత్ర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ

నిర్మల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జన ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం ఏఎస్పీ రాజేష్ మీనాతో కలిసి ఆయన పట్టణంలోని బుధవార్‌పేట్ నెంబర్ 1 గణేష్ మండపం నుంచి ఓల్డ్ బస్టాండ్, బాగులవాడ చౌక్ (ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్) గుల్జార్ మార్కెట్, గాంధీ చౌక్ మార్గంగా బంగల్‌పేట్ చెరువు నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో శానిటేషన్, లైటింగ్, త్రాగునీటి సౌకర్యాలు, భద్రత చర్యలు పటిష్ఠంగా చేపట్టాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య విభాగాలు సమన్వయంతో ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉంటాయని, ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించి, సహకరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ బుకీ అరెస్ట్

- ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో దాడి
- మొబైల్ ఫోన్లు, నగదు,బంగారు అభరణాల స్వాధీనం
- భారీగా స్థిరాస్తుల గుర్తింపు



తనిఖీల రికార్డులను నమోదు చేస్తున్న పోలీసులు

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఓవైసీనగర్ ప్రార్థన మందిరం సమీపంలోని నివాస గృహంలో గురువారం రాత్రి పోలీసులు దాడి చేసి బెట్టింగ్ బుకీని పట్టుకున్నారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ గోపినాథ్‌తో కూడిన పోలీసు బృందం అక్కడి ప్రాంతంలోని ఒక నివాస గృహంలో మెరుపుదాడి చేసి బెట్టింగ్ బుకిని అదుపులోకి తీసుకున్నారు. అతని నివాస గృహంలో తనిఖీలు చేపట్టగా భారీ మొత్తంలో నగదు పట్టుబడినట్లుగా తెలిసింది. అంతేకాకుండా కొద్దిమేర బంగారు అభరణాలు, ఎనిమిదికిపైగా నివాస స్థలాల , వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టా సర్టిఫికెట్లు, పాసు బుక్కులను సైతం గుర్తించిన పోలీసులు వాటన్నింటిని స్వాధీనపరుచుకున్నట్లుగా సమాచారం, పట్టుబడిన బెట్టింగ్ బుకిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద నుంచి రెండు మొబైల్‌ఫోన్లతో పాటు పలు రికార్డులను సైతం సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించుకపోయినట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. రాత్రి వేళలో పోలీసులు దాడి విషయం తెలుసుకున్న అక్కడి కాలనీవాసులు ఘటన స్థలికి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యల మధ్య దాడులు, తనిఖీలు చేపట్టి పట్టుబడిన బెట్టింగ్ బుకినిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. బుకీపై గ్యాంబ్లింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లుగా పోలీసు అధికారులు వెల్లడించారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- భైంసా పట్టణ శాంతి కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

భైంసా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని అన్ని వర్గాలు, మతాల వారు శాంతి, సంయమనాలతో వ్యవహరించుకుంటూ వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించుకోవాలని భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం భైంసా మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక చవితి వేడుకల సమయంలో అన్ని వర్గాలు, మతాల ప్రజలు పరస్పర సహకారం అందించుకుంటూ సోదరభావంతో వ్యవహరించుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల నిర్వాహణకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతుందని తెలిపారు. శాంతియుత వాతవరణంలో వేడుకలు కొనసాగేందుకు గాను అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్,తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఇరు వర్గాల మత పెద్దలు, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌తో పాటు గణేష్ మండలీల ప్రతినిధులు, ఇరు వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.

సమస్యలకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టాలి

మున్సిపల్ కేంద్రమైన భైంసాలో వినాయక చవితి వేడుకలకు నిర్వాహణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలకు తావులేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ వివిధ ప్రభుత్వశాఖాధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, ఫిషరీస్, అబ్కారీ, వైద్యఆరోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాంతి కమిటీ సమావేశంలో ఇరువర్గాలు వెలిబుచ్చిన అభిప్రాయలు,సలహాలు,సూచనలను పరిగణలోకి తీసుకోని ఏర్పాట్లు కొనసాగాలన్నారు. వైద్యఆరోగ్య శాఖాధికారుల నిమజ్జనోత్సవ స్థలితో పాటు ప్రధాన కూడలీల్లో నిమజ్జనోత్సవ రోజు వైద్యశిభిరాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖాధికారుల వినాయక మండలీలతో పాటు శోభయాత్ర కొనసాగే మార్గాలో ప్రమాదాలు చోటు లేకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. అగ్నిమాపకశాఖాధికారులు నిమజ్జనోత్సవ స్థలి వద్ద చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఫిషరీస్ శాఖాధికారులు గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జనోత్సవ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు గజ ఈతగాళ్లు ప్రాజెక్టు వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అబ్కారీ శాఖాధికారులు వేడుకలు ముగిసేంత వరకు బెల్ట్‌షాపులన్నీంటిని మూసివేయించాలన్నారు. అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి

మామడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని మామడ ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండప నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, రెండు బాక్సులు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జన సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డీజేల, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్సై గోపి

సోన్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్సై గోపి అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు మొదట ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొని పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టం వాడరాదని, నిమజ్జనం వేళ డీజేల వినియోగాన్ని నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్ రెడ్డి, టెక్నికల్ ఏఈ విష్ణు, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మామడ, 01.02. మామడలో గణేష్ ఉత్సవ కమిటీలతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి

నర్సాపూర్(జి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని నిర్మల్ గ్రామీణ సీఐ కృష్ణ అన్నారు. నర్సాపూర్‌లో మంగళవారం పెద్ద హనుమాన్ టెంపుల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులతో కలిసి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సీఐ కృష్ణ మాట్లాడుతూ... నిమజ్జనం సందర్భంగా అధిక శబ్దాలతో కూడిన డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్వో శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

భైంసా రూరల్ : మండలంలోని దేగాం గ్రామంలో శాంతియుతంగా గణేష్ నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ నైలు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాల కమిటీలు, సభ్యులు మండపాల వద్ద విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకొని నాణ్యమైన వైర్లను ఉపయోగించుకోవాలని, రెండు డీజే మైక్ సెట్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఫోన్ నెంబర్లను ఫ్లెక్సీలో వేయాలన్నారు.

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి మృతి

- ఆగ్రాలోని దమ్మ వాటర్ ఫాల్‌లో ప్రమాదం



ముథోల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని తరోడా గ్రామానికి చెందిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జవాన్ అయిన ఈశ్వర్ ప్రసాద్(25) అనే యువకుడు ఆగ్రాలోని దమ్మ వాటర్‌ఫాల్‌లో గల్లంతైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో వైమానిక దళంలో గత ఐదు సంవత్సరాలుగా ఈశ్వర్ ప్రసాద్ జవాన్‌గా పని చేస్తున్నారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో తోటి స్నేహితులతో కలిసి ఆగ్రాలోని దమ్మ వాటర్ ఫాల్‌కు వెళ్తున్నట్లు తండ్రి గంగాధర్‌కు బుధవారం సమాచారం ఇచ్చాడు. అయితే సాయంత్రం వరకు ఫోన్ ఫోన్ రాకపోవడంతో కుటుంబసభ్యులు కంగారు పడ్డారు. గురువారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు ఈశ్వర్ ప్రసాద్ వాటర్ ఫాల్‌లో గల్లంతై మృతి చెందాడని తండ్రికి ఫోన్‌లో సమాచారం అందించారు. తల్లిదండ్రులు సిలారం విజయలక్ష్మి, గంగాధర్ వ్యవసాయం చేసుకుంటూ, కుమారుడిని చదివించి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగానికి పంపారు. కుటుంబ సభ్యులు స్థానిక నాయకులతో కలిసి ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను శుక్రవారం రాత్రి కలిశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి వచ్చే విధంగా చూడాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి రేపటి వరకు మృతదేహం స్వగ్రామానికి వచ్చేటట్టు చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

ఖానాపూర్ శాంతి కమిటీ సమావేశం

ఖానాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న గణేశుని నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా సూచించారు. గురువారం ఖానాపూర్‌లోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని 14 గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వినాయకుల మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలతో పాటు నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాలు మరింత సాఫీగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, వైద్య, ఆరోగ్య, విద్యుత్ తదితర విభాగాల అధికారులతో పరస్పర సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులను ఆయన కోరారు. అనంతరం పట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ అజయ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్ రావు, ఆత్మక కమిటీ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రరాజం సురేష్, ఖానాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న సహా పలువురు హిందూ ఉత్సవ సమితి నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా